JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 29-11-2025
Medchal - Malkajgiri । Saturday 29-11-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 183 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 183 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

తెలంగాణలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలైన పిటిషన్‌పై ఈ తీర్పు ఇచ్చింది.




**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 28 :**

వెనుకబడిన కుల సంఘాలు గురువారం తెలంగాణ హైకోర్టులో ఎన్నికలపై స్టే కోరుతూ పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కులాలకు (ఎంబీసీ) రిజర్వేషన్లు కేటాయించాలని, అప్పటివరకూ ఎన్నికల నిర్వహణ నిలిపివేయాలని పిటిషనర్లు హైకోర్టును కోరారు. బీసీ సామాజికవర్గంలో ఏ, బీ, సీ, డీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్ విచారణ చేపట్టిన హైకోర్టు ఇదివరకే తెలంగాణలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలైనందున, ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని స్పష్టం చేసింది. తెలంగాణ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. నామినేషన్ల ప్రక్రియ సైతం ప్రారంభమైంది.



## ఈ ప్రయాణం ఇక ఆగదు

- 15 బ్యాంకులు, ఆర్థిక సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన
- రాజధానికి రూ.1,328 కోట్ల పెట్టుబడులు, 6,500కు పైగా ఉద్యోగాలు
- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు హాజరు
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు

**జయభేరి, విజయవాడ, నవంబర్ 28 :**

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములు ఇచ్చారని, ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. అమరావతిలో 15 బ్యాంకులకు, ప్రభుత్వరంగ సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఈ తరహాలో ల్యాండ్‌పూలింగ్ జరిగిన ఏకైక ప్రాంతం అమరావతి అన్నారు. 'అమరావతి పనులు ఊపందుకున్న సమయంలో

...మిగతాది 3 లో

## జనవరి 1న లొంగిపోతాము




- మావోయిస్టు పార్టీ సంచలన ప్రకటన
- 3 రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలి
- భద్రతా దళాల కార్యకలాపాలను కొనసాగించడం మాకు అంతరాయం
- 3 రాష్ట్రాలలో ఒక ముఖ్యమంత్రి లేదా హోం మంత్రి ముందు లొంగిపోతాం
- ఈ వారంలో తన భద్రతా దళాల గస్తీని నిలిపివేయాలి

**జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 28 :**

ఆయుధాలను వదిలేసేందుందుకు భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) డెడ్‌లైన్ ఫిక్స్ చేసుకుంది. ఎంఎంసి సహచరులందరూ జనవరి 1, 2026న సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేసి ప్రభుత్వాలకు ఆయుధాలు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ మేరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్పెషల్ జోనల్ కమిటీ (ఎంఎంసి) ప్రతినిధి అనంత్ మరో లేఖ రాశారు. ప్రభుత్వ పునరావాసం కల్పిస్తే లొంగిపోయేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మావోయిస్టు కమిటీ ప్రతినిధి లేఖలో పేర్కొన్న అంశాలివే.. 'అప్పటి వరకు, 3 రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని, భద్రతా కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని అభ్యర్థిస్తున్నాం.

## మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చర్యలు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**జయభేరి, న్యూ ఢిల్లీ :**

వెనెజువెలా కు చెందిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అతిత్వరలో వెనెజువెలా భూభాగంలో ఆపరేషన్లు చేపడతామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి సముద్రం మీదుగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతోందని, వాటిని ఆపడానికి భూభాగంపై నుంచే చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇప్పటికైనా తమ దేశంలోకి మాదక ద్రవ్యాలు సరఫరా చేయడాన్ని ఆపాలని వెనెజువెలాకు మరోసారి హెచ్చరిక చేశారు. అమెరికా ఇప్పటికే కరేబియన్ సముద్రంలో భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది. అమెరికా దళాలు జరిపిన దాడుల్లో 80 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటనతో ఏ క్షణమైనా అగ్రరాజ్యం

...మిగతాది 2 లో




## సర్పంచ్ పదవి కొనుగోలుపై ఈసీ ఆగ్రహం

- కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని వార్నింగ్

**జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల వేళ ఏకగ్రీవాల కోసం గ్రామాల్లో వేలంపాటలు నిర్వహిస్తుండటంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎస్ఈసి, తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్పంచ్ పదవిని అంగట్లో సరుకుగా మార్చి, డబ్బులు కుమ్మరించి కొనుగోలు చేయడం సరికాదని ఎస్ఈసీ స్పష్టం చేసింది.

**ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం:**

ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు ప్రకటించడంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ అభ్యంతరం తెలిపింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు ద్వారా ఎన్నుకోవాల్సిన పదవిని వేలంపాటల ద్వారా కొనుగోలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్య పద్ధతికి పూర్తిగా విరుద్ధమని హితవు పలికింది.

**ఎస్ఈసీ హెచ్చరిక:**

ఇలాంటి అప్రజాస్వామిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఈసీ తీవ్రంగా హెచ్చరించింది. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని కమిషన్ ఉద్ఘాటించింది.

## కామారెడ్డికి నీళ్లెక్కడ..?

**జయభేరి, నిజామాబాద్, నవంబర్ 28 :**

కాళేశ్వరం ద్వారా కామారెడ్డికి ఒక్క ఎకారానికి కూడా నీళ్లు రాలేదని, ఈ విషయం చెబితే బీఆర్ఎస్ వాళ్లు నా మీద నోరు వేసుకొని పడిపోతారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కామారెడ్డిలో జాగృతి జనం బాటలో భాగంగా కవిత మాట్లాడుతూ.. మా కుటుంబం ఉద్యమం, రాజకీయం అనే కమిట్ మెంట్ ఉన్న కుటుంబం అని అన్నారు. ప్రజలను, కుటుంబాన్ని వేర్వేరుగా చూసే పరిస్థితి లేదని, అయితే నన్ను కుటుంబం నుంచి దూరం చేసే కుట్రలో సస్పెండ్ చేయించారని ఆమె బాధ వ్యక్తం చేశారు. సస్పెండ్ చేయించిన వారు శునకానందం పొందవచ్చని, కానీ తాను మరో కుటుంబం అనుకునే తెలంగాణ కోసం పనిచేస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.




## కాంగ్రెస్ పార్టీ బీసీల కళ్లలో మట్టి కొట్టింది

- రెండేళ్లుగా డ్రామాలు ఆడి మొండిచేయి చూపించింది
- బీసీ వర్గాలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి సిద్ధమవుతున్నారు
- హుజురాబాద్ లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మా వాళ్లందరినీ గెలిపించుకుంటాం
- నేనే స్వయంగా ప్రజల దగ్గరికి వెళ్ళి ఓటు అడుగుతా.. ఈటల రాజేందర్




**జయభేరి, కమలాపూర్, నవంబర్ 28:**

కాంగ్రెస్ పార్టీ బీసీల కళ్లలో మట్టి కొట్టిందని,రెండేళ్లుగా డ్రామాలు ఆడి మొండిచేయి చూపించిబీసీ వర్గాలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి సిద్ధమవుతున్నారని పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విమర్శించారు.హుజురాబాద్ లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మా వాళ్లందరినీ గెలిపించుకుంటాం.నేనే స్వయంగా ప్రజల దగ్గరికి వెళ్ళి ఓటు అడుగుతా నన్నారు.కమలాపూర్ మండల కేంద్రంలో తన నివాసంలో గ్రామపంచాయితీలకు పోటీ చేసే అభ్యర్థులు, నాయకులతో అయన సమావేశ మయినారు.అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం బీసీలకు స్థానిక సంస్థల

...మిగతాది 2 లో

## పాత మున్సిపాలిటీ మందుబాబులకు అడ్డా!



- కార్ల పార్కింగ్లకు, పంచాయతీలకు అడ్డా!

**జయభేరి, గోదావరిఖని :**

రామగుండం కార్పొరేషన్ పరిధిలో పాత మున్సిపాలిటీ లో కొందరు ఆకతాయిలు, మందుబాబులకు అడ్డగా మారింది. రామగుండం కార్పొరేషన్ పరిధిలో పాత మున్సిపాలిటీలో రాత్రి వేళలో యువకులు, మద్యం బాబులు మద్యం సేవించి చుట్టుపక్క ప్రాంతంలో వాళ్లకు ఇబ్బంది కలిగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఓపెన్ డ్రంక్ నిషేధాజ్ఞలు ఉన్నా కూడా మందుబాబులు రామగుండం కమిషనరేట్ పోలీస్ ఆదేశాలను మందుబాబులు పట్టించుకోకపోగా యువకులు, మందుబాబులు గోదావరిఖనిలో రాత్రి సమయాలలో కొన్ని ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకొని మద్యం సేవిస్తున్నారని స్థానికులు అంటున్నారు. మందుబాబులపై స్థానిక పోలీసులు చర్యలు తీసుకొని స్థానిక ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజలు అంటున్నారు.

**పంచాయతీలకు అడ్డా..**

రామగుండం కార్పొరేషన్ పరిధిలో పాత మున్సిపాలిటీలో పంచాయతీలకు అడ్డాగా మారిందని స్థానికులు అనుకుంటున్నారు. చుట్టుపక్కల ఎవరికి ఏమి గొడవలైన, భార్యాభర్తల గొడవలు, కుటుంబ సభ్యుల గొడవలు, భూ తగాదాలకు సంబంధించిన పంచాయతీలు

...మిగతాది 2 లో




## హనీ ట్రాప్ లో ఎన్ ఆర్ ఐలు

**అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్కడ భారతీయులకు రక్షణ కరువవుతోంది. ఇప్పటికే అక్రమ వలసల పేరుతో వేల మందిని ఇంటికి పంపించారు. గ్రీన్‌కార్డులు నిలిపివేశారు. ఉద్యోగ నియామకాల్లో భారతీయులకు ప్రాధాన్యం ఇవ్వొద్దని కంపెనీలకు హుకూం జారీ చేశారు. ఇక అమెరికన్లు భారత షాపులపై దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో మరో కొత్తరకం మోసం వెలుగు చూసింది.**

**జయభేరి, న్యూయార్క్, నవంబర్ 28 :**

భారతీయ విద్యార్థులే లక్ష్యంగా హనీట్రాప్‌కు పాల్పడుతూ.. దోపిడీ చేస్తున్నారు. మాస్టర్స్ చదువుతున్న విదేశీ కొందరు విద్యార్థులు సంపన్నులైన ఎన్నారైలను ప్రేమ, రిలేషన్‌షిప్ పేరుతో మోసం చేస్తున్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

డిసెంబర్ 11, 14, 17 తేదీలలో మూడు దశలలో తెలంగాణ వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు.

**12,733 గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు..**

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు 3దశల్లో జరగనున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించింది. నవంబర్ 27న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఎన్నికలు మొత్తం 545 మండలాలు, 12,733 గ్రామాల్లో జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకుంటారు. తొలి విడతకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి దశ పోలింగ్ డిసెంబర్ 11న జరిగి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ మొదలై ఫలితాలు ప్రకటిస్తారు. రెండో, మూడో దశలు డిసెంబర్ 14, 17 తేదీల్లో జరగనున్నాయి. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ ఎన్నికల్లో మొదటి దశలో 200 మండలాలు, రెండో దశలో 200 మండలాలు, మూడో దశలో మిగిలిన 145 మండలాల్లో పోలింగ్ జరుగుతుంది. కౌంటింగ్ ప్రతి దశలో అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమై, సాయంత్రం 5 గంటలకు ముందే ఫలితాలు ప్రకటిస్తారు. ఈ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల GO Ms 46 జారీ చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు నిర్ణయించింది. ఈ కేటాయింపులు కులాలు, జనాభా ఆధారంగా జరిగాయి, మహిళలకు 50% రిజర్వేషన్లు లాటరీ విధానంతో ఖరారు చేశారు. రెండో దఫా: నామినేషన్ల స్వీకరణ - నవంబర్ 30 పోలింగ్ - డిసెంబర్ 14 (శనివారం) మూడో దఫా: నామినేషన్ల స్వీకరణ - డిసెంబర్ 3 పోలింగ్ - డిసెంబర్ 17 (మంగళవారం) మూడు దఫాల్లోనూ పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. పోలింగ్ ముగిసిన వెంటనే అదే రోజు సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఎస్ఈసీ ప్రకటించారు.

## జనవరి 1న లొంగిపోతాము

జోన్‌లో ఎక్కడా భద్రతా దళాలు అరెస్టులు లేదా ఎన్‌కౌంటర్‌లు వంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకూడదు. జోన్ అంతటా చెల్లాచెదురుగా ఉన్న మా సహచరులందరితో సంబంధాలు ఏర్పరచుకోవడానికి మేం ప్రయత్నిస్తాము. భద్రతా దళాల కార్యకలాపాలను కొనసాగించడం మాకు అంతరాయం కలిగిస్తుంది. మా ప్రయత్నాలను వేగవంతం చేయకుండా నిరోధిస్తుంది. మా ఆయుధాలను ముక్కలుగా అప్పగించే బదులు, ప్రభుత్వ పునరావాస ప్రణాళికను ఒకేసారి లేదా పెద్ద సంఖ్యలో అంగీకరించి జన జీవన స్రవంతిలో చేరాలనుకుంటున్నాం. ఛత్తీస్‌గఢ్‌లో సతీష్‌దాదా, మహారాష్ట్రలో సోను దాదా విషయంలో జరిగినట్లుగా, మేం ఆయుధాలను అప్పగించి, 3 రాష్ట్రాలలో ఒక ముఖ్యమంత్రి లేదా హోం మంత్రి ముందు లొంగిపోతాం. మేం ఆయుధాలను అప్పగించి, వచ్చే నెలలో ఈ మొత్తం ప్రక్రియను శాంతియుతంగా పూర్తి చేయడంలో సపోర్ట్ చేసే రాష్ట్ర ప్రభుత్వం ముందు ప్రధాన స్రవంతిలో చేరడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ మొత్తం ప్రక్రియ శాంతియుతంగా పూర్తికావడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలని ముఖ్యమంత్రులను అభ్యర్థిస్తున్నాను. భద్రతా దళాలు ఆ తేదీ వరకు కార్యకలాపాలను నిలిపివేసి, ఎన్‌కౌంటర్‌ల వంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉంటేనే ఇది సాధ్యం. విజయ్ శర్మ (ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర హోంమంత్రి) రేడియోలో మాట్లాడటం మేం విన్నాము. ఈ ప్రయోజనం కోసం 10 నుండి 15 రోజులు సరిపోతాయని అన్నారు. ఆయన ప్రతిస్పందనను మేం గౌరవిస్తాము, కానీ అంత తక్కువ సమయం సరిపోదు. ఆయుధాలను వదులుకుని ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావడానికి మేము నిర్ణయించిన ఖచ్చితమైన తేదీకి (జనవరి 1, 2026) ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. మా ప్రతిపాదనలు, డిమాండ్లు చేయాలనుకుంటే, ప్రభుత్వం వాటిని వింటుందని.. అందుకు ప్రయత్నాలు చేస్తుందని తన ప్రకటనలో పేర్కొన్నందుకు విజయ్ శర్మకు మా కృతజ్ఞతలు. ప్రభుత్వానికి కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలు, డిమాండ్లను చెబుతాం. ప్రధాన స్రవంతిలో చేరడానికి ముందు లేదా పునరావాసం తర్వాత విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ విషయాలు చేర్చుతాము. మిగిలిన రెండు రాష్ట్రాల (మహారాష్ట్ర, మధ్యప్రదేశ్) ప్రభుత్వాల నుండి మా అభ్యర్థనపై విజయ్ శర్మ నుండి వచ్చిన ప్రతిస్పందనతో మాకు భరోసా రాలేదు. మిగిలిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల చిడి భరోసా కలిగించే రెస్పాన్స్ కోసం చూస్తున్నాం. విజయ్ శర్మ లాగా, వారు మాకు ప్రతిపాదనలు, డిమాండ్లను అందిస్తే, ప్రజల తరపున మేం ఖచ్చితంగా అలాగే చేయాలనుకుంటున్నాము.

**ఒంటరిగా వెళ్లి లొంగిపోవద్దు..**

ఈ ప్రక్రియ అయ్యే వరకు జోన్ అంతటా ఉన్న మా సహచరులు తమ కార్యకలాపాలన్నింటినీ నిలిపివేయాలి. దానికి అంతరాయం కలిగించే ఎటువంటి ప్రేరణ లేదా చర్యలో పాల్గొనవద్దు. ఈసారి మేము PLGA వారోత్సవాన్ని పాటించబోం. ఈ వారంలో తన భద్రతా దళాల గస్తీని నిలిపివేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాము. జోన్ అంతటా ఉన్న అన్ని సహచరులకు మేం ఆడియో విజ్ఞప్తిని జారీ చేస్తాము. దీని గురించి విన్న లేదా తెలుసుకున్న వెంటనే ఒకరినొకరు సంప్రదించడానికి ప్రయత్నించాలని కామ్రేడ్లను అభ్యర్థిస్తున్నాము. స్వయంగా వెళ్లి లొంగిపోవద్దని కూడా కామ్రేడ్లను అభ్యర్థిస్తున్నాము. మనమందరం దీన్ని కలిసి చేయాలి' అని మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో మావోయిస్టు ప్రతినిధి అనంత్ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ బీసీల కళ్లలో మట్టి కొట్టింది

రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి రకరకాల డ్రామాలాడి మొండి చేయి చూపించారు. ఎన్నికలు వస్తాయని తెలిసినా సరైనా ఏర్పాట్లు లేవు. సర్వర్లు పని చేయడం లేదని కావలసిన సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. కొన్ని జిల్లాల్లో 17% మరికొన్ని జిల్లాల్లో 21% మాత్రమే బీసీలకు రిజర్వేషన్లు దక్కాయి. రెండు సంవత్సరాల నిరీక్షణ తరువాత బీసీల కళ్లలో మట్టికొట్టారు. బీసీ వర్గాలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో గతంలో పనిచేసిన సర్పంచులకు ఇప్పటివరకు బిల్లులు ఇవ్వలేదు. అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వచ్చిన డబ్బులు కూడా ఖర్చు చేయకుండా చేశారు. మళ్ళీ పోటీ చేయాలంటే భయపడుతున్నారు. రేపు నామినేషన్ చివరి రోజు.. కానీ చాలా ఊర్లలో బతిలాడి నామినేషన్ వేయించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు గుణపాఠం తెచ్చుకొని స్థానిక సంస్థలను బ్రతికించాలి. హుజురాబాద్ లో 107 గ్రామపంచాయితీలున్నాయి. మొదటి విడతలో కమలాపూర్ మండలంలో ఎన్నికలు జరుతున్నాయి. 25 ఏళ్లుగా ఈ నియోజకవర్గంలో అన్ని ఎన్నికల్లో అన్ని పదవులు మేమే గెలుచుకుంటూ వస్తున్నాం. వార్డు మెంబర్లు, సర్పంచ్, ఎంపీటీసీ గెలవకుండా MLA గెలవడం అంత సులభం కాదు. గ్రామాలలో నేరుగా సంబంధం వారికే ఉంటుంది. ఇవి అతి కీలకమైన ఎన్నికలు. 25 ఏళ్లుగా ప్రజలతో సంబంధం ఉన్న వానిగా పోటీ చేసేవారికి అండగా ఉండి గెలిపిస్తానని మాట ఇచ్చాను. ప్రజల ఆశీర్వాదంతో ఈసారి కూడా గెలిపించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. రేపు కమలాపూర్ లో నామినేషన్లు చివరి రోజు. నామినేషన్ల విత్ డ్రా పూర్తి అయ్యాక గ్రామాలలో ప్రజలకు అప్పీలు చేసుకుని మా వారిని గెలిపించండి.. మీ ఆశీర్వాదంతో మళ్లీ మీకు సేవ చేసే అవకాశం కల్పించాలని నేనే స్వయంగా కోరతాను. ఇన్నాళ్లు నా గెలుపులో కీలక పాత్ర పోషించిన వారిని గెలిపించుకోవడం నా బాధ్యత. హుజురాబాద్ ప్రజానీకానికి నేను వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాను నోట్లో నాలుకలా ఉండి, మీ మధ్యలో ఉండి, మీకు సేవ చేసే అభ్యర్థులను గెలిపించండి. మీరు మెచ్చిన, నచ్చిన అభ్యర్థులను మాత్రమే సాధ్యమైనంత మేరకు ఎంపిక చేస్తామని విజ్ఞప్తి చేస్తున్నాను. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ రెండే. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు లేవు, కేంద్రం నిధులు మాత్రమే వస్తున్నాయి. చౌరస్తాలో బల్బులు వెలగాలన్నా, సిమెంట్ రోడ్లు వేయాలన్నా, మోరీలు కట్టాలన్నా, అంగన్వాడీ బిల్డింగ్ కట్టాలన్నా, గ్రామపంచాయితీ సిబ్బంది జీతాలు రావాలన్నా కేంద్రం నిధులు మాత్రమే దిక్కు. బీజేపీకి ఓటు వేస్తే ఎక్కువ మొత్తంలో నిధులు తీసుకొని వస్తానన్నారు.

## మాదక ద్రవ్యాల అక్రమ రవాణా..

వెనెజువెలా భూభాగంపై దాడిచేసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెనెజువెలాలో అమెరికా దళాలు చొరబడవచ్చని ప్రచారం జరుగుతోందని, వెనెజువెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనిక దళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ ఇటీవల స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రెటరీ వెల్లడించారు. దాంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కూడా ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు వెనెజువెలాలోని చమురు రిజర్వులను స్వాధీనం చేసుకోవడానికే అమెరికా ఈ చర్యలు చేపడుతోందని వార్తలు ప్రచారమవుతున్నాయి.

# అనర్హతపై స్వతంత్ర ట్రిబ్యునల్

భారత రాజ్యాంగం శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య అధికారాలను స్పష్టంగా విభజించింది. ఒకరి పరిధిలో మరొకరు జోక్యం చేసుకోకూడదన్నది మౌలిక సూత్రం. దీనినే మనం 'లక్ష్మణ రేఖ'గా చెప్పుకుంటున్నాం. అయితే, ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న పరిణామాలు ఈ రేఖను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.



ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో న్యాయస్థానాలు విధించే గడువులను, తమకున్న 'విచక్షణాధికారం' పేరుతో చట్టసభల అధిపతులు వ్యవహరిస్తున్న తీరు ఒక అంతులేని రాజ్యాంగ ప్రతిష్టంభనకు దారితీస్తోంది. ప్రస్తుతం ఈ ఘర్షణకు కేంద్ర బిందువు 'ఫిరాయింపుల నిరోధక చట్టం' అమలు. తెలంగాణలో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నారు. స్పీకర్ తీరును ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయినా, స్పీకర్ గడువు పొడిగింపు కోరడం, పండుగలు, ఇతర కారణాలను చూపడం గమనార్హం. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నా, ఫలితం ఒక్కటే. వైసీపీ ఎమ్మెల్సీలు తమ పదవులకు రాజీనామా చేసినా, శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు వాటిని ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచారు. దీనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని డెడ్ లైన్ విధించింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకునే సర్వాధికారం స్పీకర్ లేదా ఛైర్మన్‌దే. ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోంది. రాజ్యాంగం స్పీకర్ నిర్ణయానికి కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని, ఆయా పార్టీలకు అనుకూలంగా స్పీకర్లు నిర్ణయాలను సంవత్సరాల తరబడి నాన్చుతున్నారు.

స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదే అయినా, వారు ఏదో ఒక పార్టీకి చెందినవారే. పదవిలో ఉన్నప్పుడు పార్టీకి రాజీనామా చేసే సంప్రదాయం భారత్‌లో లేదు. దీంతో సహజంగానే వారి నిర్ణయాలు అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా ఉంటున్నాయి. 1992 నాటి 'కిహోటో హోలోహాన్' కేసులో సుప్రీంకోర్టు ఒక చారిత్రక తీర్పునిచ్చింది. స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కోర్టులు జోక్యం చేసుకోకూడదని, నిర్ణయం వెలువడ్డాక మాత్రమే అది న్యాయ సమీక్షకు వస్తుందని చెప్పింది. ఇదే ఇప్పుడు స్పీకర్లకు కవచంగా మారింది. నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేయడం ద్వారా న్యాయస్థానాల పరిధిలోకి వెళ్లకుండా వారు తప్పించుకుంటున్నారు. కానీ, మణిపూర్ కేసులో స్పీకర్లు నిర్ణయం తీసుకోవడానికి సహేతుకమైన సమయం అంటే సాధారణంగా 3 నెలలు పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయినా, స్పీకర్లు కోర్టు ఆదేశాలను ఖాతరు చేయడం లేదు. "స్పీకర్‌ను ఆదేశించే అధికారం కోర్టుకు లేదు" అనే వాదనతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారు. చట్టసభల ప్రొసీడింగ్స్‌లో కోర్టులు జోక్యం చేసుకోకూడదని ఆర్టికల్ 212 చెబుతోంది. కానీ, ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నప్పుడు కోర్టులు మౌనంగా ఉండాలా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. స్పీకర్ల జాప్యం వల్ల ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఐదేళ్ల పదవీకాలాన్ని, మంత్రి పదవులను అనుభవిస్తున్నారు. ఇది ప్రజా తీర్పును అపహాస్యం చేయడమే. ఒకవేళ కోర్టులు స్పీకర్ అధికారాల్లో అతిగా జోక్యం చేసుకుంటే, భవిష్యత్తులో పార్లమెంటరీ వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు మధ్య ఆధిపత్య పోరు తీవ్రమై వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ పరిరక్షణ జరగాలంటే ఆ 'సన్నని గీత'ను దాటి ఆలోచించక తప్పదు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి వేదికగా సరికొత్త రాజకీయ, న్యాయ పోరాటం మొదలైంది. వైఎస్ఆర్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికై, ఆ తర్వాత పార్టీకి, పదవికి రాజీనామా చేసిన జయమంగళ వెంకటరమణ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. రాజీనామా లేఖపై నిర్ణయం తీసుకోవడంలో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు చేస్తున్న కాలయాపనపై హైకోర్టు సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా నిర్ణయం తేల్చాలని ఆదేశించడంతో, ఈ అంశం ఇప్పుడు వ్యవస్థల మధ్య ఘర్షణకు దారితీస్తుందా అనే చర్చకు తెరలేపింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జయమంగళ వెంకటరమణ గతంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరారు, ఆ తర్వాత రాజకీయ సమీకరణాల రీత్యా వైసీపీకి, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం ఆయన తన రాజీనామా పత్రాన్ని మండలి ఛైర్మన్ మోషేన్ రాజుకు అందజేశారు. అయితే, ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. రాజీనామా చేసి చాలా కాలం గడుస్తున్నా, ఛైర్మన్ దానిని ఆమోదించలేదు, అలాగని సాంకేతిక కారణాలతో తిరస్కరించనూ లేదు. ఫైలును పెండింగ్‌లో పెట్టేశారు. దీంతో వెంకటరమణ అటు మాజీ కాలేక, ఇటు పదవిలో కొనసాగలేక సతమతమవుతున్నారు. తన రాజీనామాను ఆమోదించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆయన హైకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది "స్పీకర్ లేదా ఛైర్మన్ రాజ్యాంగం కల్పించిన అధికారాలను దుర్వినియోగం చేస్తూ, నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా జాప్యం చేస్తే కోర్టులు జోక్యం చేసుకోవచ్చు" అని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లు లేదా రాజీనామాలపై రీజనబుల్ టైమ్ (సాధారణంగా 3 నెలలు) లోపు నిర్ణయం తీసుకోవాలని గతంలో సూచించింది. ఏపీ హైకోర్టు కూడా ఇదే ప్రాతిపదికన 4 వారాల గడువు విధించినట్లు న్యాయ నిపుణులు భావిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ముందు మూడు దారులు ఉన్నాయి. 4 వారాల్లోగా రాజీనామాను ఆమోదించడం లేదా తిరస్కరించడం. ఇది జరిగితే సమస్య సద్దుమణుగుతుంది. లేదంటే శాసనసభల అధికారాల పేరుతో డివిజన్ బెంచ్‌కో, సుప్రీంకోర్టుకో వెళ్ళవచ్చు. అదీ కాదంటే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం. ఇది జరిగితే న్యాయస్థానధిక్కారం కిందకు వస్తుందా లేక శాసనసభల ఆధిక్యత నెగ్గుతుందా అనేది చూడాలి. మొత్తానికి, జయమంగళ వెంకటరమణ పిటిషన్ ఏపీ రాజకీయాల్లోనే కాకుండా, రాజ్యాంగపరమైన చర్చకు కూడా దారితీసింది. మండలి ఛైర్మన్ నిర్ణయంపైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ఆయన మౌనం వీడతారా లేక న్యాయ పోరాటానికి సిద్ధపడతారా అన్నది వేచి చూడాలి. చట్టసభల అధిపతులు తమ విచక్షణాధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నప్పుడు, న్యాయస్థానాలు కేవలం ప్రేక్షకుల్లా మిగిలిపోకూడదు. దీనికి శాశ్వత పరిష్కారం స్పీకర్ చేతిలో ఉన్న అనర్హత వేటు అధికారాన్ని తొలగించి, ఒక 'స్వతంత్ర ట్రిబ్యునల్'కు అప్పగించడమే అని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే లక్ష్మణ రేఖకు అర్థం, రాజ్యాంగానికి పరమార్థం దక్కుతాయి.

## కామారెడ్డికి నీళ్లెక్కడ..?

తాను జైల్లో ఉన్నప్పుడు తన పిల్లల కన్నా కూడా మా అమ్మ ఆరోగ్యం గురించే ఎక్కువ బాధపడ్డానని, తెలంగాణ అనే మరో కుటుంబం తనకు ఉందని, వారి కోసం ధైర్యంగా పనిచేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇక కామారెడ్డికి చాలా ప్రత్యేకత ఉంది. ఇక్కడ నుంచే కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని కవిత గుర్తుచేశారు. ఇక్కడి నాయకులు చెబితే నమ్మరని కర్ణాటక సీఎం సిద్ధిరామయ్యను తీసుకొచ్చి హామీలు ఇప్పించిందని, కానీ అదే కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ బీసీలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆమె విమర్శించారు. అయినప్పటికీ ప్రజలు వారి మాటలు నమ్మి గెలిపించారని, ఈ విషయమై ఎవరూ అడగరని కాంగ్రెస్ భావిస్తుందేమోనని, తాము జాగృతి తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు. గతంలో అసెంబ్లీలో పూలే విగ్రహం, సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా టీచర్ దినోత్సవం చేసేలా తాము కృషి చేశామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ యథావిధిగా అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేశామని, తమ పోరాటం ఫలితంగా మూడు బిల్లులు అడిగితే రెండు బిల్లులు తెచ్చారని, కానీ ఆ రెండు బిల్లులు కూడా రాష్ట్రపతి వద్ద ఆగిపోయాయని తెలిపారు. ఆ తర్వాత తాము రైల్ రోకో చేస్తామని వార్నింగ్ ఇస్తే మళ్లీ ఆర్డినెన్స్ తెచ్చారని, కానీ ఆ ఆర్డినెన్స్ కూడా గవర్నర్ వద్దే ఆగిపోయిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బీజేపీ, కాంగ్రెస్‌లతో కొట్లాడుతూనే ఉంటామని, బీసీ రిజర్వేషన్ల సాధనలో జాగృతి ముందుంటుందని కవిత ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని కవిత ఆరోపించారు. కాంగ్రెస్ ఎంబీసీలకు మినిస్ట్రీ ఇస్తామని ప్రకటించి, దాని జోలికి కూడా పోలేదని విమర్శించారు. నాయి బ్రాహ్మణులు, రజకులకు ఇచ్చిన ఫ్రీ కరెంట్ బంద్ పెట్టారని, 3 లక్షల లోపు వార్షికాదాయం ఉన్నవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్నారు గానీ, ఇప్పుడు ఫీజు చెల్లించకపోవడంతో బీసీ, ఎంబీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డలు బాధ పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అన్నారు, తాము హైదరాబాద్‌లో పోరాటం చేసి 42 శాతం రిజర్వేషన్లు వచ్చేలా చేశామని పేర్కొన్నారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్లతో బడ్జెట్ పెడతామని చెప్పిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలో బీసీలకు 9 వేల కోట్లే బడ్జెట్ పెట్టిందని, అందులో సగం మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. రెండో ఏడాది 11 వేల కోట్లు బడ్జెట్ పెట్టినా కనీసం పావు వంతు కూడా ఖర్చు చేయలేదని, కనీసం రాజీవ్ యువ వికాసం లోనైనా పెద్ద ఎత్తున బీసీలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎంబీసీలకు కార్పొరేషన్ అన్నారు, దాని ఊసే లేదని, అన్ని కులాలకు ఫెడరేషన్లు అని చెప్పి ఇప్పటి వరకు రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి గారిని బీసీ ద్రోహిగా తాము ఇప్పటికే ప్రకటించామని, ఆయన ఇప్పటి వరకు కూడా ప్రధాని మోడీకి ఈ అంశంపై ఒక్క లేఖ రాయలేదని, అఖిలపక్షాన్ని కూడా ఢిల్లీకి తీసుకెళ్లలేదని విమర్శించారు. ఢిల్లీలో మాత్రం రెండు సార్లు ధర్నా చేస్తే రాహుల్ గాంధీ కూడా రాలేదని, వాళ్ల ధర్నాల కారణంగా నెట్ రిజల్ట్ జీరో ఉందని ఎద్దేవా చేశారు. తమిళనాడులో జయలలిత 9 ఏళ్లు ఎన్నికలను ఆపి రిజర్వేషన్లు సాధించారని గుర్తుచేస్తూ, ఇంత అర్జెంట్‌గా పంచాయితీ ఎన్నికల అవసరమేముందని కవిత ప్రశ్నించారు. కేంద్రం నుంచి నిధులు రావనుకుంటే దాని గురించి వారితో మాట్లాడాలని, కాంగ్రెస్‌కు బీసీలకు న్యాయం చేయాలనే తపన లేదని, అందుకే ఇంత తొందరగా ఎన్నికలు పెడుతున్నారని ఆరోపించారు. పార్టీల పరంగా సీట్లు అంటే కాంగ్రెస్ ఇచ్చిన చోటే బీఆర్ఎస్, బీజేపీ బీసీలకు సీట్లు ఇస్తుందా అని ప్రశ్నిస్తూ, ఏదో ఇచ్చినట్లు ఇచ్చి వారిని ఓడగొట్టాలన్న కుట్ర అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయే యాకుత్‌పుర సీటును బీసీకి ఇచ్చి ఓడగొట్టారని ఆమె విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో అందరికన్నా మొదటి ద్రోహి బీజేపీ, రెండో ద్రోహి కాంగ్రెస్ అని, ఆ రెండు పార్టీలను తాము నిలదీస్తూనే ఉంటామని కవిత ప్రకటించారు.

## హనీ ట్రాప్ లో ఎన్ ఆర్ ఐలు

తర్వాత వ్యక్తిగత సందేశాల ద్వారా ఒత్తిడి పెడుతూ విలువైన వస్తువులు, డేటా, బ్లాక్‌మేల్ చేస్తున్నారు. వివిధ దేశాల నుంచి అమెరికాకు వెళ్లి మాస్టర్స్ చేస్తున్న అమ్మాయిలు.. భారతీయ సంపన్నులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఎన్నారైలను నమ్మించి హెల్పర్లుగా ఇళ్లలో చేరుతున్నారు. తర్వాత నమ్మకంగా ఉంటూ ఇళ్లలోని డబ్బులు, జ్యువెల్లరీ, పర్సనల్ ఇన్ఫర్మేషన్, విలువైన వస్తువులు దొంగతనం చేస్తున్నారు. ఎన్నారైలు ఎక్కువగా ఒంటరిగా ఉండడంతో చాలా మంది సహాయకుల కోసం చూస్తుంటారు. దీంతో అమ్మాయిలు ఈ ఎన్నారైలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. తర్వాత దొంగతనం చేసిన డేటా ఆధారంగా ఎన్నారైలను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు లాక్కుంటున్నారు. ఈ తరహా ట్రాప్ ఎక్కువగా డల్లాస్, ఓహియోలో ఎక్కువగా జరుగుతుందని ఓ యువతి ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేసింది. కొందరు అయితే హనీట్రాప్‌తోపాటు పర్సనల వీడియోలో, మెస్సేజ్‌లను కూడా మిస్‌యూజ్ చేస్తున్నట్లు సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కొందరు డబ్బులు డిమాండ్ చేసి ఇలా వచ్చిన డబ్బులతో ఇళ్లు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక డల్లాస్, ఓహియో ప్రాంతాల్లో ఇలాంటి చీటింగ్‌లకు అరెస్టులు ఉండవు. ఈ నేపథ్యంలో ఎన్నారైలే జాగ్రత్తగా ఉండాలని సూచించింది. అలాగే కొందరు స్టూడెంట్స్ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ మోసాలకు కూడా పాల్పడుతున్నారని తెలిసింది. ప్రేమ, అబ్యూజ్, హనీట్రాప్ పేరుతో చీటింగ్ చేస్తున్నారు. వీరి లక్ష్యం ఆర్థికంగా ప్రయోజనం పొందడమే. సాధారణంగా హనీట్రాప్.. దేశాల రహస్యాలు తెలుసుకోవడానికి వాడుతుంటారు. కానీ సంపన్న దేశంలో యువతులు.. ఇలా ఒళ్లు అమ్ముకోవడం, ప్రేమ, అబ్యూస్ పేరుతో డబ్బులు సంపాదిస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై నెటిజన్లు స్పందిస్తున్నారు. ఇలాంటివి చికాగో, సెయింట్ లూసియాలో కూడా జరుగుతున్నాయని ఓ ఎన్నారై పోస్టు పెట్టాడు. వీటిపై అమెరికా ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలని కొందరు కామెంట్ చేశారు. కొందరు బీకేర్‌ఫుల్ అని సూచిస్తున్నారు. ఒక స్టూడెంట్ రెండేళ్లలో 8 కోట్లు సంపాదించిందని ఓ బాధితుడు తెలిపాడు. కొందరు ఇలాంటివి ప్రపంచమంతా ఉన్నాయని పేర్కొంటున్నారు.

## పాత మున్సిపాలిటీ మందుబాబులకు అడ్డా!

కూడా పాత మున్సిపాలిటీలో జరుగుతున్నాయని అక్కడి ప్రజలు అంటున్నారు. కొందరి రాజకీయ నాయకుల అండదండలతో పాత మున్సిపాలిటీలో జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

**పాత మున్సిపాలిటి పార్కింగ్ లకు అడ్డా!**

రామగుండం కార్పొరేషన్ పరిధిలో పాత మున్సిపాలిటీ లో మందుబాబులే కాకుండా చుట్టుపక్కల ఉన్న, నగరంలో ఉన్న ప్రముఖుల వాహనాలు సైతం వారందరికీ వాహనాలు కార్లు పెట్టుకోవడానికి అడ్డగా మారిందని. కొన్ని సమయాల్లో తెలియని వాహనాలు, నంబర్ లేని వాహనాలు పాత మున్సిపాలిటీ ఆఫీసులో పార్కింగ్ చేస్తున్నారని అంతేకాకుండా కొన్ని రోజుల తరబడి వాహనాలు పార్కింగ్ చేసి ఉంటున్నాయని స్థానికులు అంటున్నారు. స్థానిక పోలీసులు పాత మున్సిపాలిటీలో మందుబాబులపై, పార్కింగ్ లపై తనిఖీలు నిర్వహించాలని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు.

# ఈ ప్రయాణం ఇక ఆగదు

▶▶ మొదటిపేజీ తరువాయి




2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దాంతో అయిదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన ఘనత కేంద్రానిదే. రాష్ట్ర ఆర్థికస్థితిని గుర్తించి కేంద్రం సహాయ సహకారాలు అందిస్తోంది. కేంద్రం సహకారంతో ఏపీలో పలు రంగాల్లో పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. రాజధాని అమరావతిని మరో స్థాయికి తీసుకెళ్లాలా పనులు చేసి చూపిస్తాం. దేశం మొత్తం గర్వపడేలా అమరావతిని తీర్చిదిద్దుతాం. టెక్నాలజీని అందిపుచ్చుకునే హబ్‌గా రాజధానిగా అమరావతిని మార్చుతాం. ఏడు జాతీయ రహదారులు అమరావతికి అనుసంధానం కానున్నాయి. రహదారులతో కనెక్టివిటీ పెరుగుతుంది. కంపెనీలు సైతం అమరావతి వైపు చూస్తున్నాయని' చంద్రబాబు అన్నారు.ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ ఏర్పాటయ్యాక ప్రధాని మోదీ రాజధాని అమరావతి పనులను మళ్లీ శంకుస్థాపన చేసి పనులు రీస్టార్ట్ చేశారు. మార్చి 2028 నాటికి పూర్తయ్యేలా అమరావతి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అందుకు ముఖ్య కారణం ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అమరావతి నిర్మాణానికి మాకంటే వేగంగా రూ.15వేల కోట్ల నిధులు అందించారు. తాజాగా రూ.1,334 కోట్లతో వివిధ బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల భవనాలకు నేడు శంకుస్థాపన చేశారు. ఒకేచోట ఏర్పాటు చేస్తున్న అన్ని కార్యాలయాలలో మొత్తం 6500 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. నిర్మలా సీతారామన్ తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉంది. ఏపీకి సరైన సమయంలో నిధుల కొరత లేకుండా చూస్తున్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, అమరావతి రాజధాని పునర్నిర్మాణంతో పూర్వ వైభవం పొందుతోందని పేర్కొన్నారు. నూతన రాజధాని అమరావతి ఆర్థికంగా మరింత పరుగులు పెట్టేందుకు ప్రపంచంలోనే తొలిసారిగా ఒకేసారి 15 బ్యాంకులకు శంకుస్థాపన చేసే అరుదైన కార్యక్రమం ఇది అని ఆమె తెలిపారు. రాజధాని అమరావతి కోసం త్యాగం చేసిన రైతుల పాత్రను ఎప్పటికీ మరిచిపోవద్దని, ఇక్కడ ఏర్పాటు చేస్తున్న బ్యాంకులు అటువంటి రైతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.దేశ వ్యాప్తంగా కూరగాయలకు, పండ్లకు డిమాండ్ పెరుగుతోందని ఆమె అన్నారు. రైతులు పండించిన పంటల మార్కెటింగ్ కోసం వారానికి రెండు లేదా మూడు సార్లు ప్రత్యేక రైళ్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏర్పాటు చేశారని నిర్మలా సీతారమన్ గుర్తుచేశారు. విభజన తర్వాత వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుండి పూర్తిగా సహకరించేందుకు ప్రధాని సిద్ధంగా ఉన్నారని హామీ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కి సంబంధించి రాష్ట్రంలో రెండు జిల్లాలలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, దానికి బడ్జెట్ పరంగా కేంద్రం నుండి సహాయ సహకారాలు అందిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం క్వాంటం వ్యాలీ ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే, సైన్స్ సబ్జెక్టుల పైన పూర్తిగా దృష్టి పెట్టేందుకు వీలుగా సైన్స్ ప్లానిటోరియం ఎడ్యుకేషన్ ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

### కేంద్రానికి ధన్యవాదాలు

రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజలందరికీ కనిపించేలా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం అమరావతి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రూ.1334 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలకు ఆయన శంకుస్థాపన చేశారు.సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అమరావతిని ఆర్థిక లావాదేవీల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం ఒక శుభసూచికమని పేర్కొన్నారు. పలు బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలు ఒకేచోట కొలువుదీరడం అరుదైన విషయమని, ఆ ఘనతను అమరావతి సాధించిందని అన్నారు. ఈ కేంద్రాలన్నీ ఒకేచోట ఉండటం వల్ల ఆర్థికంగా అందరికీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ రోజు వేస్తున్న పునాదులు అమరావతి ఆర్థిక భవిష్యత్తు నిర్మాణానికి అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న విశ్వాసంతోనే రైతులు రాజధాని కోసం భూములు త్యాగం చేశారని పవన్ అన్నారు. అమరావతి పునర్నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, స్టీల్ ప్లాంట్ వంటి కీలక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా సహకరిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### ఈ ప్రయాణం ఇక ఆగదు

రాజధానిలో ఆర్థిక కార్యకలాపాలను పరుగులు పెట్టించే లక్ష్యంతో రూ.1,334 కోట్ల వ్యయంతో 15 ప్రతిష్ఠాత్మక ఆర్థిక సంస్థలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేయడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, కెనరాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, నాబార్డ్ వంటి దిగ్గజ సంస్థల రాకతో అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ శరవేగంగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. ఈ సంస్థల ద్వారా ప్రత్యక్షంగా 6,556 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ సంస్థలన్నీ తమ ప్రధాన కార్యాలయాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో నిర్మించాలని ఆయన కోరారురాజధాని నిర్మాణం కోసం 34 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులకు ఈ సందర్భంగా చంద్రబాబు శిరస్సు వంచి నమస్కరించారు. ప్రపంచంలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన ల్యాండ్ పూలింగ్ విధానంలో భూ సమీకరణ జరిగిన ఏకైక ప్రాంతం అమరావతి అని కొనియాడారు. రాజధాని పునర్నిర్మాణ పనుల కోసం కేంద్రం రూ.15 వేల కోట్లను కేటాయించిందని గుర్తుచేశారు. "దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గాడిలో పెట్టారు. వారి సహకారంతో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ నిలబెడుతున్నాం. ఇంకా ఇబ్బందులు ఉన్నా, అభివృద్ధి సాధించగలమన్న విశ్వాసం మాకుంది" అని అన్నారు. అమరావతికి కేవలం ఆర్థిక సంస్థలే కాకుండా ప్రపంచస్థాయి విద్యా, వైజ్ఞానిక సంస్థలు కూడా తరలివస్తున్నాయని చంద్రబాబు తెలిపారు. విట్, ఎస్ఆర్ఎం వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కోసం క్వాంటం వ్యాలీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ఆధ్వర్యంలో కాస్మోస్ ప్లానెటోరియం కూడా ఏర్పాటు కానుండటం శుభపరిణామమన్నారు. త్వరలోనే సీడ్ యాక్సెస్ రహదారిని పూర్తి చేస్తామని, 7 జాతీయ రహదారులు, రైల్వే లైన్లతో అమరావతిని అనుసంధానిస్తామని చెప్పారు. అమరావతిని పూర్తిస్థాయి గ్రీన్, బ్లూ సిటీగా తీర్చిదిద్ది, భారతదేశం గర్వపడే రాజధానిగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధిపైనా ఆయన కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు పారిపోయాయని, అయితే కూటమి ప్రభుత్వంపై భరోసాతో ఏపీకి మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయని, అందులో భాగంగానే గూగుల్ సంస్థ రూ.1.37 లక్షల కోట్ల పెట్టుబడితో విశాఖకు వస్తోందని వెల్లడించారు. మరోవైపు, గోదావరి, కృష్ణా నదుల నుంచి సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు అనుసంధానించి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు పూర్వోదయ పథకం కింద ఉదారంగా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, కేంద్ర సహకారంతో ఏపీ త్వరలోనే నిలదొక్కుకుని దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

### అమరావతి దేవతల రాజధాని

రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు తిరిగి ఊపందుకున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణాలు జెట్ స్పీడ్‌లో సాగుతున్నాయని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శుక్రవారం అమరావతిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 15 బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. రూ.1334 కోట్ల పెట్టుబడితో ఈ సంస్థలు తమ కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "దేవతల రాజధాని అమరావతిని దెయ్యాలు విధ్వంసం చేయాలని చూశాయి. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి ఈ ప్రాంతాన్ని నాశనం చేయాలని ప్రయత్నించారు" అని ఆయన ఆరోపించారు. ఒక్క వ్యక్తి కోసం రూ.450 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారని విమర్శించారు. రైతులు మాత్రం 'ఒకే రాష్ట్రంఒకే రాజధాని' నినాదంతో పోరాడారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా 'జై అమరావతి' అంటూ ముందుకు సాగారని కొనియాడారు.ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ఈ రాజధానిని ఆపడం ఎవరి ఇంట్లో లైట్ స్విచ్ కాదని లోకేశ్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందిస్తున్న సహకారానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆమె నిరాడంబరతకు హ్యాట్సాఫ్ చెబుతూ, మంగళగిరి చేనేత వస్త్రాలను ధరించి వాటికి ప్రచారం కల్పించారని ప్రశంసించారు. పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవడంలో విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడంలో ఆమె కీలక పాత్ర పోషించారని వివరించారు. రాజధానిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేయనున్న ఈ 'బ్యాంక్ స్ట్రీట్' నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలు జరుగుతాయని లోకేశ్ తెలిపారు.

# మనిషిని మహోన్నతుడిగా తీర్చిది విద్య

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.

జయభేరి, ఉప్పల్ :



మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒకటే అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అందరికీ విద్యను అందించేలా కృషిచేసిన మహనీయుడు, తత్వవేత్త, సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా సైనిక్ పూరి X రోడ్ వద్ద జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే. సామాజిక ఉద్యమాల మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే చదువు లేనిదే జ్ఞానం లేదు, జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే సత్యాన్ని గ్రహించి 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీయుడు జ్యోతి రావు పూలే. విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు కృషిచేశారు. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు వివక్షతలకు గురయిన బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, కా ప్రా డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మల్లేష్‌వంశీ రాజు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండవ రోజు నామినేషన్లు దాఖలు

జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 28 :




తుర్కపల్లి మండలంలోని 33 గ్రామపంచాయతీలో శుక్రవారం రెండవ రోజు 194 నామినేషన్లు దాఖలు అయినట్లు మండల ఎన్నికల అధికారి, అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధమల్ల సర్పంచ్ 1,వార్డ్ మెంబర్ 8, ఇందిరానగర్ వార్డ్ మెంబర్ 2,వీరారెడ్డిపల్లి వార్డ్ మెంబర్ 2,గొల్లగూడెం సర్పంచ్ 3, వార్డ్ మెంబర్ 3,మో తిరాం తండా సర్పంచ్ 3,వార్డ్ మెంబర్ 7,పల్లె పహాడ్ వార్డ్ మెంబర్ 1,రామోజీ నాయక్ తండ సర్పంచు 2 ,బద్దు తండ సర్పంచ్ 1, భిల్యా నాయక్ తండా సర్పంచ్ 1,వార్డ్ మెంబర్ 5,మల్కాపురం సర్పంచ్ 1,వార్డ్ మెంబర్ 6,కొండాపురం సర్పంచ్ 4 ,వార్డు మెంబర్ 12,తిరుమలపూర్ సర్పంచ్ 1,వార్డు మెంబర్ 4 ,వాసలమర్రి సర్పంచ్ 2,వార్డ్ మెంబర్ 4,గుజ్జుని కుంట వార్డ్ మెంబర్ 1,ఇబ్రహీంపూర్ సర్పంచ్ 1,వార్డు మెంబర్ 8,వేలుపల్లి సర్పంచ్ 1,వార్డ్ మెంబర్ 8,వెంకటాపూర్ సర్పంచ్ 2,బాబు నాయక్ తండ సర్పంచ్ 1,వార్డు మెంబర్ 3,చొక్లా తండా సర్పంచ్ 3,వార్డ్ మెంబర్ 10,పెద్దతండ వార్డ్ మెంబర్ 3,రుస్తాపూర్ సర్పంచ్ 5,వార్డ్ మెంబర్ 9,దయ్యం బండ తండా సర్పంచ్ 1,వార్డ్ మెంబర్ 2, జేటిరామ్ తండా సర్పంచ్ 3,వార్డు మెంబర్ 7,తుర్కపల్లి వార్డ్ మెంబర్ 1, ముల్కపల్లి సర్పంచ్ 2, రామాపురం తండా సర్పంచ్ 2, వార్డ్ మెంబర్ 13, చిన్న లక్ష్మపురం సర్పంచ్ 2, వార్డ్ మెంబర్ 12, ధర్మారం సర్పంచ్ 1 ,వార్డ్ మెంబర్ 1 ,మాదాపూర్ సర్పంచ్ 2, వార్డు మెంబర్ 8 ,నాగయ్య పల్లి సర్పంచ్ 4, వార్డు మెంబర్ 5 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, స్టేజ్ వన్ రిటర్నింగ్ ఆఫీసర్స్ మనోహర్ బాబు, సుజాత, మంజూష, సత్యం, నాగరాజు, అనంతరెడ్డి, రవీందర్, నాయక్, శ్రీనివాస్, బిక్కు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు శ్రీనివాస్ రెడ్డి, చౌహన్, మహేష్, విజయ్ కుమార్, రాజశేఖర్, శివరాజు, రవీందర్, మధుకర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.




# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

జయభేరి, గార్ల, నవంబర్ 28:

సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని గార్ల ఎస్సై సాయి కుమార్ హెచ్చరించారు.స్థానిక సంస్థల ఎన్నికలపై శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇతరుల మనో భావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించవద్దన్నారు.ఏదైనా వర్గాన్ని కించపరిచేలా తెలియని సమాచారాన్ని పోస్ట్ చేయడం, షేర్ చేయడం నేరంగా పరిగణించ బడుతుందని అన్నారు.ఏ గ్రూపులోనైనా ఇలాంటి పోస్టులు షేర్ అయితే, ఆ గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యుడిగా పరిగణిస్తామని తెలిపారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు గార్ల పోలీసులు అన్ని గ్రామాల వాట్స్ ఆప్ గ్రూప్ లలో ఉంటూ ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ వుంటుందని తెలిపారు.అనుచిత పోస్ట్ లు ఫార్వర్డ్ చేసిన వారిపైన కూడా కేసులు నమోదు చేయబడతాయని పెర్కొన్నారు.సామాజిక మాధ్యమాలను సమాజానికి మంచిని చేకూర్చే విధంగా మాత్రమే ఉపయోగించుకోవాలని, నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రానున్న గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా హద్దు మీరి సోషల్ మీడియా లో విమర్శలు చేస్తే చర్యలుంటాయని తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరికలు

■ కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, నవంబర్ 28:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య తెలిపారు. ఆలేరు మండలం మంతపురి గ్రామానికి చెందిన 50 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన మరో 50 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అయిలయ్య పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి నిరూపించిందని,ఇందుకు ఇందిరమ్మ ఇండ్లు,కొత్త రేషన్ కార్డులు,సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలే మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. అందరి సహకారంతో ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ప్రజల తోడుగా ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య కోరారు.

# ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మీసాల ఉప్పలయ్య




జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 28:

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామానికి చెందిన మీసాల ఉప్పలయ్య నియామకమయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య తనను నియమిస్తూ శుక్రవారం నియామకం పత్రం అందజేసినట్లు విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంచాల యాదగిరి,రాష్ట్ర యువసేన కో ఆర్డినేటర్ కాసగల్ల రమేష్,ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొసెటింగ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం



జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 28:

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రొజెటింగ్ ఆఫీసర్లకు తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అధికారి, అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్ మాట్లాడుతూ ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, మాస్టర్ ట్రైనర్స్ అశోక్, నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం దురదృష్టకరం



జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 28 :

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడం దురదృష్టకరమైన విషయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు అశోక్ గౌడ్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులు వార్డు సభ్యులుగా బిజెపి అభ్యర్థులు పోటీ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్ ,రాష్ట్ర నాయకులు యాట పెంటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు, ఆకుల రమేష్, చాంద్ పాషా, కందుకూరి చిన్న చలమయ్య, దొంకెన రాజు గౌడ్, గుండెబోయిన మల్లేశం, ఆకుల భాస్కర్, కందుకూరి వేణు, పర్వతాలు, నాయకులు పాల్గొన్నారు.

# భూనిర్వాసితుల ధర్నా

జయభేరి, జయశంకర్ భూపాలపల్లి:

సింగరేణి ఓపెన్ కాస్ట్ 2వ గని వద్ద భూనిర్వాసితులు ధర్నాకు దిగారు. ఓసీ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు సింగరేణి సంస్థ నష్టపరిహారం ఇవ్వాలనీ డిమాండ్ చేసారు. అలాగే...ఓసీ ప్రభావిత గ్రామాలైన ఆకుదారి వాడ, పక్కీర్ గడ్డ , కాకతీయ కాలనీ, మదీనా కాలనీ,హనుమాన్ నగర్ ప్రాంతాలను మొత్తం సింగరేణి తీసుకొని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆందోళనకారులు అన్నారు. ఓపెన్ కాస్ట్ 2 గేటు ముందు పోలీసులతో వాగ్వాదం దిగడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. సింగరేణి జీఎం అక్కడికి చేరుకుని హామీ ఇవ్వడంతో ధర్నా భూ నిర్వాసితులు విరమించారు.



# మద్యం షాపులు వివాదంపై పరవాడ పోలీస్ శాఖ వివరణ

జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో మద్యం షాప్స్ మూసివేతపై శుక్రవారం కొన్ని పత్రికల్లో ప్రచురితమైన "పోలీసుల వేధింపులు తట్టుకోలేక మద్యం షాపులు మూసివేత" అనే వార్తపై అది పూర్తిగా తప్పుడు వార్త అని అది వాస్తవం లేకుండా రాసిన కథనం అని పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ మద్యం సేవనం, బెల్ట్ షాపులు, అనధికార విక్రయాలపై చర్యలు తీసుకోవడం ఇవి అన్నీ పోలీసుల సాధారణ విధి నిర్వహణలో భాగం మాత్రమేనని దీనిని కొన్ని పత్రికలో వేధింపులుగా వార్త కథనాలు రావడం పూర్తిగా అవాస్తవం అని తెలియజేసారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేయడం చట్టబద్ధమైన చర్య అని ఇది ప్రజా శాంతి, భద్రత కోసం చేయబడుతోందని అన్నారు. అధికారికంగా లైసెన్స్ ఉన్న వైన్‌షాపులపై నిబంధనలు మీరి ఎటువంటి దాడులు చేయడం గాని, షాపుల వద్దకు వేళ్లడం గాని జరగలేదని తెలియజేసారు. బహిరంగ మద్యపానం, బెల్ట్ షాపుల నిర్వహణ వంటి అక్రమ చర్యల పై భవిష్యత్లో కూడా చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

# దిబ్బల గొర్లివానిపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం దిబ్బల గొర్లివానిపాలెం 22 లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో గ్రామంలోని అభివృద్ధి పనులు ను ప్రారంభించబడినవి. ఈ అభివృద్ధి కార్యక్రమాలను గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు ఆధ్వర్యంలో పనులను మొదలుపెట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దిబ్బల గొర్లిలవానిపాలెం గ్రామంలో ఏడు రోడ్లకు గాను 22 లక్షల రూపాయలతో పనులు ప్రారంభం అయ్యాయి అని గ్రామ అభివృద్ధే నా లక్ష్యం. ప్రతి వాడా, ప్రతి వీధీ సుందరంగా, శుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్నాం. ప్రజల అవసరాల నిమిత్తం సిసి రోడ్లు డ్రైన్లు కలవర్ట్స్ మంచినీటి కుళాయిలు ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో ప్రారంభం కానున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లె రామారావు వార్డు నెంబర్ పోలిరెడ్డి అప్పారావు వైఎస్ఆర్సిపి మండల ప్రధాన కార్యదర్శి గొర్లి శ్రీనివాస్, వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రొ0గలి నాయుడు, కైసర్ల ప్రసాద్, చీపురుపల్లి నర్సింగరావు, పైల ప్రశాంత్, లక్ష్మణ్, దొడ్డు రాము పాల్గొన్నారు.

# ముఖాముఖి కార్యక్రమం




జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్), దేవరకొండలో కమిషనర్ ఆఫ్ కాలేజ్ హైయర్ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం అకాడమిక్ ఆడిట్ టీమ్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరాజు (ప్రిన్సిపాల్, ఉమెన్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నల్గొండ), బి.నాగరాజు (సీనియర్ బయోటెక్నాలజీ అధ్యాపకులు నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలనల్గొండ) కళాశాలలోని అధ్యాపకులు విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులతో అధ్యాపకులతో మాట్లాడి మంచి భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా ఆవశ్యకత గురించి కొన్ని సూచనలు అందించారు. అనంతరం కళాశాలలోని అన్ని విభాగాలలోని అకాడమిక్ రికార్డులను తనిఖీలు నిర్వహించి అన్ని విభాగాలు చాలా చక్కగా రికార్డులను నిర్వహిస్తున్నారని ఇంకా మెరుగైన రికార్డుల నిర్వహణ కొరకు తగిన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ కె. పృథు, డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ కె.రేణుక, తదితర అధ్యాపకులు, సీనియర్ అసిస్టెంట్ పి.క్రాంతి కుమారి, రికార్డ్ అసిస్టెంట్ సూదిని వెంకటరెడ్డి (నాన్ టీచింగ్ జిల్లా అధ్యక్షులు) తదితర అధ్యాపకేతరులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి కార్యక్రమము



జయభేరి, చందంపేట :

చందంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి మాట్లాడుతూ జ్యోతిబాపూలే అట్టడుగు వర్గాల వారికి అందరికీ విద్యను అందించాలని ఉద్దేశంతో స్వయంగా తన భార్యను విద్యావంతురాలు చేసిఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దినారు. సమాజంలో అందరికీ సమన్యాయము సమాన విద్యావకాశాలు ఉండాలని వారి ఉన్నతికి అహర్నిశంగా శ్రమించారని కొనియాడారు. తదుపరి వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేసినారు. ఈ కార్యక్రమంలో ఏం చంద్రశేఖర్ , గోవిందు కొండయ్య, జోసెఫ్ చౌదరి ఎల్ మధు డాక్టర్ వెంకట్ సంధ్యారాణి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లంకెలపాలెంలో 69వ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలు

జయభేరి, పరవాడ:



జీవీఎంసీ 79వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఫార్మ సిటీలో లారస్ ల్యాబ్స్ కంపెనీ సహకారంతో మూడు రోజులపాటు నిర్వహించ తలపెట్టిన 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాల బాలికల ఖో ఖో ఛాంపియన్షిప్ అండర్ 14 పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాల బాలికలు పాల్గొనే ఈ క్రీడా పోటీలను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు పొడవు ఉండే జాతీయ త్రివర్ణ పతాకాన్ని క్రీడాకారులు ర్యాలీగా ప్రదర్శించారు. జాతీయ జెండా ర్యాలీని అతిధులు జండా ఊపి ప్రారంభించారు. లంకెలపాలెం జంక్షన్ మీదుగా పోటీలలో పాల్గొనే విద్యార్థులు జాతీయ పతాకాన్ని ఊరేగింపుగా ర్యాలీగా చేస్తూ ప్రదర్శించారు. జాతీయ ఐక్యత భావాన్ని కలిగించే విధంగా దారి పడువునా నినాదాలు చేశారు. బాణాసంచా పెద్ద ఎత్తిన కాల్చుతూ విద్యార్థులు డప్పు వాయిద్యాలతో ర్యాలీగా వెళుతూ క్రీడా స్ఫూర్తిని నెలకొల్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతి కార్యక్రమాలు పలువురని ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, జిల్లా విద్యాశాఖ అధికారి సంయుక్తంగా రిబ్బన్ కత్తిరించి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలకు ఆర్థిక సహకారం అందించిన ప్రముఖ ఫార్మా సంస్థ లారస్ ల్యాబ్స్ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు , క్రీడల అభివృద్ధికి లారస్ ల్యాబ్స్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ పూజారి శైలజ, ఉప విద్యాశాఖాధికారి పీ. అప్పారావు, 79 వ కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ గుర్రం అప్పలరాజు, ఎంఈఓ దివాకర్రావు, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం శ్రీధర్ రెడ్డి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, క్లస్టర్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, ఎస్ జి ఎఫ్ కార్యదర్శిలు టి. నాగేశ్వరరావు, కేఎం నాయుడు, పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు గోపీనాథ్, పెద్దినాయుడు, గ్రౌండ్ ఇంచార్జీ ఎం.వి నాగేశ్వర రావు, లక్ష్మి, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు, ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




# దీక్ష దివాస్ కార్యక్రమం ను విజయవంతం చేయాలి

- కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా - దివస్
- అరవై ఏండ్ల గాయాలు, వేదనలను తెలంగాణ కన్నీళ్లను తీర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్
- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

జయభేరి, దేవరకొండ :

నేడు నల్గొండ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న దీక్షా దివాస్ కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలి బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు నిచ్చారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.....దీక్షా దివాస్ సందర్భంగా కెసిఆర్ చేసిన ఉద్యమ పోరాటం, గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అన్న తెగువతో నాలుగు కోట్ల మందిని ఏకం చేసి, కాశ్మీర్ నుండి కన్యా కుమారి వరకు అన్ని రాజకీయ వ్యవస్థలను ఒప్పించి మెప్పించి కుల మతాలకు అతీతంగా ఏకం చేసిన దీక్షా దివాస్ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా దివస్ అని ఆయన అన్నారు.అరవై ఏండ్ల గాయాలు, వేదనలను తెలంగాణ కన్నీళ్లను తీర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని ఆయన తెలిపారు.గాలి, నీరు, నేల ఉన్నంత కాలం తెలంగాణలో కేసీఆర్ అనే మూడక్షరాలు పదిలం అని ఆయన అన్నారు.

# నియామక పత్రం అందజేత



జయభేరి, దేవరకొండ :

సమాచార హక్కు ప్రచార్ సమితి(RTI) దేవరకొండ నియోజకవర్గం ప్రచార కార్యదర్శి సభావాట్ గోవింద్ నియమితులైన సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కాట్రవత్ రాజు నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరేష్ జిల్లా అధ్యక్షులు నారమోని హరీష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. వారు మాట్లాడుతూ.. సమాచారం హక్కు ప్రచార్ సమితి (RTI) విభాగంలో నాపై నమ్మకంతో దేవరకొండ నియోజకవర్గం ఉపాధ్యక్షులు నియమించినందుకు ధన్యవాదములు రాష్ట్ర జిల్లా కమిటీ వారు సూచన మేరకు నా వంతుగా కృషి చేస్తానని, సమాచార చట్టం పై అందరికి అవగాహనా కల్పిస్తానని వారు తెలియచేశారు ఈకార్యక్రమంలో RTI చందు నాయక్ కొండల్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి

జయభేరి, దేవరకొండ :




దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా అధ్యక్షుడు NVT సభ్యులతో కలిసి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావ్ పూలే ఒక సామాజిక సంస్కర్త, విద్యావేత్త మరియు కుల వ్యతిరేక కార్యకర్త. ఈయన మహిళా విద్య కోసం, సామాజిక సమానత్వం కోసం కృషి చేశారు అని మరియు సత్యశోధక్ సమాజ్ను స్థాపించారు. జ్యోతిరావు పూలే మహారాష్ట్రకు చెందిన సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త రచయిత. సమాజంలో కుల వివక్షను, లింగఅసమానతలను రూపుమాపాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో సమానత్వం, ప్రేమ, గౌరవం ఉండాలని నమ్మి, ఆయన సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించారు. మహిళల విద్యను ప్రోత్సహించడం, పేదలు అంటరానివారి జీవితాలను మెరుగుపరచడం వంటి అంశాలపై కృషి చేశారు అని సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, తాళ్ల సురేష్, భాస్కర్ రెడ్డి, శ్రీనయ్య, వల మల్ల ఆంజనేయులు, వంగూరు వెంకటేశ్వర్లు, ఆదర్శ్, చరణ్, రమేష్, ఆనంద్, శివకుమార్, షేక్ శంశోదీన్, భరత్, రాంబాబు, బారిములు, రాజకుమార్, చక్రపాణి, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్ సందర్శన



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఆర్టీసీ డిపోను హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిపోను, స్థానికంగా ఉన్న రెండు బస్ స్టేషన్లను కొండమల్లేపల్లి బస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ డిపోలో ఉద్యోగులను కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ మెరుగైన ఉత్తమ సేవలను అందిస్తూ ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని పలు సూచనలు చేశారు. ఉద్యోగులు సమిష్టి కృషితో డిపోను ముందంజలో ఉంచాలని అన్నారు. బస్ స్టేషన్లను, డిపోను పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్మికుల సంక్షేమం కోసం ఆర్టీసీ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగులు కార్మికులు ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇక ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేస్తూ డిపోను రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం కె.జాన్ రెడ్డి, దేవరకొండ డిపో ఇన్చార్జి మేనేజర్ పడాల సైదులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాములకు అన్న ప్రసాద వితరణ

జయభేరి, దేవరకొండ :



దేవరకొండలోని ఆంజనేయ స్వామి స్వాములకు దేవరకొండ ఎల్ ఐసి బ్రాంచ్ మేనేజర్ ఎస్ రాము చౌహన్ అన్న ప్రసాద వితరణ మహా గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. సమాజంలోని మానవ మార్గంలో పయనించి దైవమార్గాన్ని ఆచరించినప్పుడే పాప పుణ్యాలు తొలగి దైవముక్తి దొరుకుతుందని దేవరకొండ ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ రాము చౌహన్ అన్నారు. ఆంజనేయ స్వామి భక్తులకు దీక్షను కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్వాములకు భిక్ష ఏర్పాటు చేసినారు. ఆలయ కమిటీ వారు రాము చౌహన్ కుటుంబ సభ్యులను సన్మానించి ఆంజనేయస్వామి కృపవలన ఇంకా ఎన్నో ఉన్నతమైన బాధ్యతలు స్వీకరించాలని దేవుని మనసారా కోరుకున్నారు.








**సోలార్ పవర్/సౌర విద్యుత్ గురించి విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం కూడా "ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం పేర సౌర పలకాల ఖర్చులో 40 శాతం సబ్సిడీని ఇస్తుంది.దాదాపు రూ.78,000 సబ్సిడీ వస్తుంది. 3 కిలో వాట్ సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఆన్ గ్రిడ్ పెట్టుకుంటే దాదాపు రూ.2,13,000 ఖర్చు అవుతుంది.ఇందులో రూ.78,000 సబ్సిడీ పోను రూ.1,35,000 అవుతుంది.3 కిలో వాట్ సోలార్ ప్యానెల్స్ రోజుకు దాదాపు 12 నుండి 15 యూనిట్లు, నెలకు 360 నుండి 450,సంవత్సరానికి 4,000 నుండి 5,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.**

# ఇంటిమీద సోలార్ పెట్టుకుంటే లాభమేనా?





మేరుగు రాజయ్య
దుద్దెనపల్లి, సైదాపూర్
9441 440 791

సౌర విద్యుత్ స్థాపనకు పెట్టే రూ.1,35,000 బ్యాంకులో పొదుపు చేస్తే ఫర్ ఆనమ్ 6 శాతం సాధారణ వడ్డీ చొప్పున లెక్కించితే నెలకు రూ.675 అవుతుంది. అలాగే 5 కిలోవాట్ ఆన్ గ్రిడ్ సోలార్ ప్యానెల్స్ పెట్టుకుంటే దాదాపు రూ.3,55,000 ఖర్చు అవుతుంది. అందులో రూ.78,000 సబ్సిడీ పోను రూ.2,77,000 భరించాలి.ఇట్టి మొత్తానికి 6 శాతం వడ్డీ చొప్పున నెలకు రూ.1,385 వస్తుంది. మరల అట్టి డిపాజిట్ పొదుపు డబ్బులు మనవి మనకే ఉంటాయి.5 కిలోవాట్స్ సోలార్ ప్యానెల్స్ రోజుకు 20 నుండి 25 యూనిట్లు, నెలకు 600 నుండి 750 సంవత్సరానికి 7,000 నుండి 9,000 విద్యుత్ యూనిట్లు ఉత్పత్తి అయ్యే అవకాశాలు ఉన్నవి. నెలకు 400 యూనిట్ల విద్యుత్ ను గృహ వినియోగానికి పోను మిగిలిన 200 యూనిట్ల విద్యుత్ ను పవర్ గ్రిడ్ కు అమ్ముకునే అవకాశం ఉంది. కాని గ్రిడ్ కు సరఫరా అయ్యే విద్యుత్ యూనిట్ కు సోలార్ గృహ యాజమానికి ఎంత చెల్లిస్తారనే భరోసా లేదు. అందుగురించే మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు ఇంటిమీద సోలార్ పవర్ ను పెట్టుకోవటానికి ఊగిసలాడుచున్నారు. సూర్యుడి నుండి వెలుబడుచున్న కాంతి కిరణాలు, వేడి అతినీలలోహిత కిరణాలు వెలువడుతాయి.అలా సూర్యుడి నుండి సుమారు 174 పెటావాట్ల(ఒక పెటావాట్ 10,00,000 గిగావాట్లు)శక్తి కలిగిన సూర్య కిరణాలు వెలువడుతాయి. అందులో 30 శాతం అంతరిక్షంలోకి తిరిగి పోతాయి.మిగిలిన వేడి మేఘాలు, సముద్రాలు, భూమి గ్రహించుకుంటాయి. ఒక గంట సౌర శక్తితో సంవత్సర కాలం విద్యుత్ అవసరాలను తీర్చుకునే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నవి.కాని ఇప్పటి వరకు సౌర శక్తిలో 0.001 శాతమే ఉపయోగించుకోవడం జరుగుతుంది. సోలార్ ప్యానెల్స్ (పలకాలు)లో ఉన్న సిలికాన్, కణాలు కలిసి సౌర శక్తి తయారు అవుతుంది. పోటాన్లు సోలార్ ప్యానెల్స్ ను తాకినప్పుడు అవి వాటి అణువుల నుండి ఎలక్ట్రాన్ లను కోల్పోతాయి. అప్పుడు కండక్టర్ సెల్ యొక్క సానుకూల, ప్రతికూల భుజాలు అనుసంధానించబడినప్పుడు విద్యుత్ సర్క్యూట్ ఏర్పడుతుంది. అటువంటి సర్క్యూట్స్ ద్వారా ఎలక్ట్రాన్లు ప్రవహించినప్పుడు డైరెక్ట్ విద్యుత్(డిసి విద్యుత్) ఉత్పత్తి అయి ఇన్వర్టర్ లతో ఆల్టర్నేటివ్ విద్యుత్ (ఏసి విద్యుత్)గా మార్పు చెంది గృహావసరాల వినియోగానికి మిగిలింది గ్రిడ్ కు సరఫరా అవుతుంది. భారత్ సౌర విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచంలో మూడవ అతిపెద్ద దేశం.2025 అక్టోబర్ నాటికి 123.33 గిగావాట్లు (ఒక గిగావాట్ =1,000 మెగావాట్లు), పవన (విండ్ ఎనర్జీ) విద్యుత్ 2025 మార్చి నాటికి 28,974 మెగావాట్ల విద్యుత్, 2025 జూన్ నాటికి ఉష్ణ/థర్మల్ విద్యుత్ 240 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దేశం మొత్తం స్థాపిత విద్యుత్ లో 50.5 శాతం ఉష్ణ విద్యుత్ కాగ, ఇందులో 91 శాతం బొగ్గు ఆధారిత ప్రక్రియ నుండే వస్తుంది. 2023 2024 ఆర్థిక సంవత్సరంలో జల విద్యుత్ ఉత్పత్తి 133.97 బిలియన్ యూనిట్లు,46.92 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది.ఇది విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 10 శాతం సరఫరా చేస్తుంది. అణు విద్యుత్ 7 రాష్ట్రాలలో 22 అణు రియాక్టర్ లలో 2023 2024 లో 56,681 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది.ఇక తరంగ విద్యుత్ చాల తక్కువ ఉత్పత్తిలో ఉంది. భారత్ లోని 7,500 కిలోమీటర్ల సముద్ర తీరంలో దాదాపు 40 నుండి 60 గిగావాట్ల సైద్ధాంతిక తరంగ విద్యుత్ ను ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నవి.ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీ పరిశోధనలు చేస్తుంది.సముద్ర అలల వేవ్ పవర్ ప్లాంట్స్ నిర్మాణంకై కేరళలో ప్రయత్నాలు చేస్తున్నారు.

పునరుత్పాదక శక్తిని విశ్వవ్యాప్తం చేయడానికి 2015 డిసెంబర్ 12న ప్రపంచ దేశాల మధ్య పారిస్ లో ఒప్పందం జరిగింది.గ్లోబల్ వార్మింగ్ కు వ్యతిరేకంగా "ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ అన్ క్లైమేట్ చేంజ్ "(యుఎన్ ఎఫ్ సిసిసి) వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువు సాంద్రతలను స్థిరీకరించడానికి పూనుకున్నాయి. సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక పూర్వ స్థాయిల కంటే 2 డిగ్రీల సెంటిగ్రేడ్ లోపల మరియు సాధ్యమైనప్పుడల్లా ఆస్థాయి కంటే 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే తక్కువకు పరిమితం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నవి. 2020 నుండి సంపన్న దేశాలు దాదాపు 100 బిలియన్ డాలర్ల (రూ.7,000,000,000,000) బడ్జెట్ ను కేటాయించాయి.భారత ప్రభుత్వం కూడా కోటి రెసిడెన్షియల్ రూఫ్ టాప్ సోలార్ పవర్ ను నెలకొల్పడానికి రూ.75,021 కోట్లు కేటాయించింది.2024 ఫిబ్రవరి ప్రారంభించి 2027 మార్చి 31 నాటికి కోటి గృహాలకు సౌర విద్యుత్ ను అందించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. కాని ప్రభుత్వ పరంగా సోలార్ ప్యానెల్స్ మరియు అనుబంధ ఇన్వర్టర్ లు, ఉపకరణాల మన్నిక, నాణ్యతలపై ప్రజలకు సరియైన అవగాహనను కల్పించడానికి చొరవ చూపడం లేదు."ది సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా"(ఎస్ఇసిఐ)సౌర శక్తి సంబంధమైన ప్రభుత్వ సంస్థ ఉంది. విద్యుత్ చట్టం 2003, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ భద్రతా నిబంధనలు 2010 ఉన్నవి. పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ 2024 మార్చి 16 నాటి ఆర్డర్ నంబర్ 318/17/2024 జిసిఆర్టీ(గ్రిడ్ కనెక్టెడ్ రూఫ్ టాప్) మార్గదర్శకాలు ఉన్నవి. కాని ప్రజలను చైతన్యం చేయడానికి కార్యాచరణకు పూనుకోవడం లేదు.


మార్కెట్ లో అనేక పోటో వోల్టాయిక్ (పివి) సోలార్ ప్యానెల్స్ ఉన్నవి.ఒకొక్క సోలార్ ప్యానెల్ కు ప్రత్యేక ప్రయోజనాలు, నష్టాలు,లక్షణాలు కలిగి ఉన్నవి.ముఖ్యంగా మూడు రకాల సోలార్ ప్యానెల్స్ ఉన్నవి. (1)మోనోక్రిస్టలైన్ ప్యానెల్ ఒకే సిలికాన్ నుండి తయారు.సొగసైన నల్లని రూపంతో ఉంటాయి.సమర్థంగా పని చేస్తాయన్న పేరుంది. కాని ఖరీదైనవి. (2)పాలీ క్రిస్టలైన్ బహుళ సిలికాన్ లతో తయారు.నీలం మచ్చల రూపాన్ని కలిగి ఉంటాయి. కొద్దిగా చౌక ధర ఉంటుంది. (3) థిన్ పిల్మ్ ప్యానెల్ పోటో వోల్టాయిక్ మెటీరియల్ పొరలను ఒక సబ్ స్ట్రేట్ పై జమ చేయడం ద్వారా తయారవుతుంది. తక్కువ సామర్థ్యం, తేలికైనవి. సౌకర్యవంతంగా, తక్కువ ఖర్చుతో కూడుకున్నవి. ఇంకా పాసివ్ ఎమిటర్, రియల్ సెల్ (పిఇఆర్ సి)ఇది మోనోక్రిస్టలైన్ ప్యానెల్ యొక్క అధునాతన వెర్షన్.సౌర ఘటం ద్వారా ఉపయోగించని కాంతిని తిరిగి ప్రతిబింబించేలా సెల్ వెనుక భాగంలో ఒక పొరను జోడిస్తూ సామర్థ్యాన్ని పెంచుతుంది. బైఫేషియల్ ప్యానెల్ సూర్యరశ్మిని ముందు, వెనుక భాగం నుండి కూడా సంగ్రహించగలవు. టాప్కాన్ (టన్నెల్ ఆక్సైడ్ పాసివేటెడ్ కాంటాక్ట్) ప్రత్యేక టన్నెల్ ఆక్సైడ్ పొరను జోడించడం ద్వారా మోనోక్రిస్టలైన్, బైఫేషియల్ సౌర ఘటాల సామర్థ్యాన్ని మెరుగుపరిచే కొత్త సాంకేతికతగా పేరుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఇన్వర్టర్ ది కూడా కీలక పాత్ర.సోలార్ ప్యానెల్స్ ద్వారా ఉత్పత్తి అయిన డీసీ (డైరెక్ట్ కరెంట్) పవర్ ను ఇన్వర్ట్ ద్వారా ఏసీ(ఆల్టర్నేటివ్ కరెంట్) ఫవర్ గా మార్చి గృహ వినియోగానికి అలాగే మిగులు విద్యుత్ ను "ఆన్ గ్రిడ్"కు సరఫరా చేయడానికి ఇన్వర్టర్ లు తోడ్పడుతాయి. అందులో 1) సన్ గ్రో ఎస్జీ 110 సి స్ట్రింగ్ ఇన్వర్టర్. ఇందులో 9 స్వతంత్ర ఎంపీపీటి (మాగ్జిమమ్ ఫవర్ పాయింట్ ట్రాకింగ్)ఇన్ పుట్ లు ఉంటాయి. 2) ఎన్ ఫేస్ ఐక్యూ 8హెచ్ సి మైక్రో ఇన్వర్టర్. అధిక సామర్థ్యం ప్యానెల్స్, సెల్, బైఫేషియల్ ప్యానెల్స్ కు అనుకూలంగా పని చేస్తాయి. 3) సోలార్ ఎడ్జ్ హెచ్డిఎస్ఇ5000హెచ్ సోలార్ ఇన్వర్టర్.అధిక సామర్థ్యంతో పని చేస్తుంది. ఇంకా లూమినస్ సోలార్ వెర్టర్ ప్రో, గ్రోవాట్ ఎంఐసి 750 3300 టీఎల్, మైక్రోటెక్, లీవ్ గార్డ్ గ్రిడ్, డెల్టా ఎలక్ట్రానిక్స్ మొదలగు ఇన్వర్టర్ లు ఉన్నవి. ఇంకా రూఫ్ టాప్ సోలార్ పవర్ ఉత్పత్తిలో గ్రిడ్ కు ఇచ్చే విద్యుత్ యూనిట్లను, పవర్ గ్రిడ్ నుండి తీసుకునే యూనిట్లను నమోదు చేసే నెట్ మీటర్, స్మార్ట్ మీటర్, యాంకర్ పాస్టేనర్, హార్డ్ వేర్ ఫౌండేషన్ బోల్ట్స్, విద్యుత్ ఉత్పాదకతను నమోదు చేసే జనరేటర్ మీటర్, అర్రే జంక్షన్ బాక్స్ లు, టెర్మినల్ బాక్స్ లు, బస్ బార్ లు, రబ్బర్ గాస్కెట్ లు, హింగ్డ్ డోర్ సింగిల్ డబుల్ కంప్రెషన్ కేబుల్ గ్లాండ్స్, బస్ సపోర్ట్ ఇన్సులేటర్ లు, సర్క్యూట్ బ్రేకర్లు, ఎస్పీడీలు, ఓల్టేజి ట్రాన్స్ పార్మర్ లు, తక్కువ టెన్షన్ (ఎల్టీ) పవర్ సిస్టమ్ స్విచ్ యార్డ్ కోసం ఎర్తింగ్ గ్రిడ్ ఇన్వర్టర్. జంక్షన్ బాక్స్ లు, డీసీ సైడ్ ఎర్తింగ్, ఏసీ సైడ్ ఎర్తింగ్, మెరుపు అరెస్టర్ ఎర్తింగ్, కనెక్టర్ లు, స్విచ్ లు, సర్క్యూట్ బ్రేకర్లు, ఏసీ, డీసీ, పివిసీ పాలీ వినైల్ క్లోరైడ్ ఇన్స్ లేటెడ్ కేబుల్స్, లైట్నింగ్ కేబుల్స్, మాడ్యూల్ మౌంటింగ్ స్ట్రక్చర్ (ఎమ్ఎమ్ఎస్) ఉంటాయి. రూఫ్ టాప్ సోలార్ పవర్ నిర్మాణ కంపెనీలు అనేకం ఉన్నవి. అందులో "టాటా పవర్ సోలార్ ,అదానీ సోలార్,విక్రమ్ సోలార్, వారీ ఎనర్జీస్, రెన్యూసిస్ ఎమ్మెవీ అజార్ పవర్,జాక్సన్ పవర్, గోల్డీ సోలార్, మగ్గం సోలార్, బృహస్పతి, సోవా,ప్రీమియర్, మహీంద్రా సస్టేన్,మైక్రో టెక్ మొదలగు సోలార్ ప్లాంట్స్ నిర్మాణ కంపెనీలు ఉన్నవి. అయితే రూఫ్ టాప్ సోలార్/ఇంటి మీద సోలార్ ప్యానెల్స్ పెట్టుకుంటే లాభమా? నష్టమా ?? అనేది ప్రజలకు జవాబులేని ప్రశ్నగా మిగిలిపోయింది.అయితే మహారాష్ట్రలోని నాగపూర్ లో జరిపిన అధ్యయనం ప్రకారం ఇంటి మీద సోలార్ ప్యానెల్స్ పెట్టుకుంటే లాభమే అనిపిస్తుంది. 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్యానెల్స్ కు రూ.1.15 లక్షల పెట్టుబడితో స్థాపించుకుంటే 25 సంవత్సరాల కాలంలో రూ.11.05 లక్షల పొదుపు,3 కిలోవాట్ల సోలార్ ప్యానెల్స్ ను రూ.1.32 లక్షల పెట్టుబడితో స్థాపించుకుంటే 25 సంవత్సరాల కాలంలో రూ.16.58 లక్షలు,4 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్యానెల్స్ కు రూ.1.77 లక్షల పెట్టుబడితో స్థాపించుకుంటే 25 సంవత్సరాల కాలంలో రూ 22.11 లక్షలు,5 కిలోవాట్స్ సోలార్ ప్యానెల్స్ రూ.2.27 లక్షల పెట్టుబడితో స్థాపించుకుంటే 25 సంవత్సరాల కాలంలో రూ.34.43 లక్షలు,10 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్స్ ను రూ.5.02 లక్షల పెట్టుబడితో స్థాపించుకుంటే 25 సంవత్సరాల కాలంలో రూ 68.86 లక్షలు పొదుపు చేసుకునే అవకాశం ఉందనే అంచనాలను వెల్లడించారు. స్వరాష్ట్రం తెలంగాణలో 2015 మార్చి 8 న 6,755 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది.2025 మార్చి 20 నాటికి 17,165 మెగావాట్ల డిమాండ్ కు పెరిగింది.2025 నవంబర్ 25 నాటి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ మంత్రివర్గ సమావేశంలో ఫవర్ గ్రిడ్ రక్షణ గురించి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను స్థాపించడానికి,ఇప్పుడున్న "నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్"(ఎన్ పిడిసిఎల్), "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్"(ఎస్ పిడిసిఎల్) తో పాటుగా మూడవ డిస్కమ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఏర్పాటుకు మరియు దీర్ఘకాలిక విద్యుత్ డిమాండ్ ను సమీక్షించిన పిదప పునరుత్పాదక ప్రోత్సాహంకై 3,000 మెగావాట్ల సోలార్ పవర్ ను కొనుగోలు చేయడానికి టెండర్లను పిలవాలని నిర్ణయించారు.రానున్న విద్యుత్ డిమాండ్ ను పరిగణనలోకి తీసుకుని నెలకు 300 నుండి 400 విద్యుత్ యూనిట్లను వినియోగించుకుంటున్న ఎగువ మధ్యతరగతి ఆపై ఆర్థిక స్థితి ఉన్న ఇంటి యాజమానులు సోలార్ ప్యానెల్స్ పెట్టుకుంటే ప్రయోజనం ఉంటుందని పరిశోధకులు సూచిస్తున్నారు.



## ‘అఖండ 2’ తాండవం టీజర్ ఔట్ ..

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ‘అఖండ 2’ మరో వారం రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. బాలయ్య ద్విపాత్రాభినయం, పవర్‌ఫుల్ డైలాగులు, యాక్షన్ ఎలిమెంట్స్ కలగలిపిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సంయుక్త మీనన్ హీరోయిన్‌గా, ఆది పినిశెట్టి ప్రధాన ప్రతినాయకుడిగా నటిస్తుండగా, పూర్ణ కీలకపాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్ , ట్రైలర్ సినిమాపై బజ్‌ను మరింతగా పెంచాయి. అఘోర పాత్రలో బాలయ్య నటన, ఆధ్యాత్మికతతో కలిపిన పంచ్‌లైన్స్, హై ఇన్టెన్సిటీ యాక్షన్ సీన్స్ ఫ్యాన్స్‌ను ఉత్సాహపరుస్తున్నాయి. తాజాగా ‘అఖండ 2 తాండవం’ పేరుతో మరో టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మాస్ లెవెల్‌ను పెంచేలా రూపొందిన ఈ వీడియోలో బాలయ్య గెటప్స్, యాక్షన్ బ్లాక్స్, పవర్‌ఫుల్ డైలాగులు ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. అభిమానులకు పూనకాలు తెప్పించేలా హై వోల్టేజ్ యాక్షన్‌ను చూపించారు. టీజర్ ప్రారంభంలో “భారత్‌ని కొట్టాలంటే... అక్కడి మూలాలను అడ్డం పెట్టుకొని కొట్టాలి” అని విలన్ చెబుతాడు. వెంటనే త్రిశూలంతో శివస్వరూపంలో బాలయ్య ఎంట్రీ ఇచ్చే సన్నివేశం విజువల్లీ అద్భుతంగా ఉంది. అఘోర లుక్‌లో కనిపించిన బాలయ్య.. “కొండల్లో తొండల్ని తిని బతికే మీరెక్కడ... ప్రతి కొండని క్షేత్రంగా మార్చి పూజించే మేమెక్కడ!” అంటూ పవర్‌ఫుల్‌గా చెప్పిన సీన్ చూసి ఫ్యాన్స్ పులకరించారు. మరో సన్నివేశంలో గద పట్టుకుని బాలయ్య చేసే యాక్షన్, ఆ సమయంలో ఆకాశంలో కనిపించే హనుమంతుడు – ఈ కాంబినేషన్ టీజర్‌లో అద్భుతంగా నిలిచింది. ఆది పినిశెట్టి విలన్‌గా తన మాంత్రిక శక్తులతో విధ్వంసం సృష్టించే సీన్లు కూడా థ్రిల్లింగ్‌గా ఉన్నాయి. మొత్తానికి బాలయ్య అఘోర, శివుడు, సాధారణ నాయకుడు అనే మూడు గెటప్స్‌లో కనిపించడం కొత్త కుతూహలాన్ని రేపుతోంది. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో, 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట-గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఇది బాలయ్య కెరీర్‌లో తొలి పాన్-ఇండియా రిలీజ్ కావడం ప్రత్యేక ఆకర్షణగా మారింది.తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానున్న ‘అఖండ 2’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఈ శుక్రవారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు.

## 45ఏళ్ల తర్వాత తెలుగులో?



బాపు ‘వంశవృక్షం’(1980)లో తొలిసారి తెలుగుతెరపై కనిపించారు బాలీవుడ్ అగ్ర నటుడు అనిల్ కపూర్. ఆ తర్వాత బాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా ఎదిగిన ఆయన.. ప్రస్తుతం క్యారెక్టర్ నటుడిగా బిజీ. రీసెంట్‌గా ‘యానిమల్’ సినిమాతో తెలుగు ప్రేక్షకులను కూడా అలరించిన అనిల్ కపూర్.. 45ఏండ్ల విరామం తర్వాత మళ్లీ డైరెక్ట్ తెలుగు సినిమాలో నటించనున్నారు. ఆ సినిమా మరేదోకాదు.. ఎన్టీఆర్ ‘డ్రాగన్'(వర్కింగ్ టైటిల్). ఎన్టీఆర్ నటజీవితంలోనే గొప్ప సినిమాగా ‘డ్రాగన్’ని మలిచేందుకు సర్వశక్తులను ఒడ్డుతున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పటికే చాలావరకు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్‌కు సిద్ధం అవుతున్నది. ఈ షెడ్యూల్‌లోనే అనిల్ కపూర్ జాయిన్ అవుతారట. ఇందులో ఆయన కీలకపాత్రను పోషిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. డిసెంబర్‌లో మొదలుకానున్న ఈ షెడ్యూల్‌లో అనిల్‌కపూర్‌పై కీలక సన్నివేశాలను తీస్తారట ప్రశాంత్‌నీల్. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## 51 ఏళ్లలోనూ 30 లుక్‌లో మలైకా..



51 ఏళ్ల వయసులో మలైకా అరోరా ఇంకా బాలీవుడ్ హాటెస్ట్ ఫిట్‌నెస్ ఐకాన్! ఆ టోన్డ్ బాడీ, ఫ్లాట్ యాబ్స్, గ్లోయింగ్ స్కిన్ చూస్తే ‘ఏంటీ మాయ?’ అనిపిస్తుంది. యోగా, పిలేట్స్, వెయిట్ ట్రైనింగ్, స్ట్రిక్ట్ డైట్... ఇవన్నీ ఆమె రోజువారీ రొటీన్‌లో భాగమే! కానీ అసలు సీక్రెట్ ఏంటంటే డిసిప్లిన్, కన్సిస్టెన్సీ, సెల్ఫ్ లవ్! రోజూ 6 గంటలకే లేచి వర్కౌట్, షుగర్‌జంక్ ఫుడ్‌కి గుడ్‌బై, గ్రీన్ టీప్రోటీన్ షేక్స్ హాయ్! మలైకా పంచుకున్న తన ఫిట్‌నెస్ సీక్రెట్స్ డైట్ టిప్స్, వర్కౌట్ రొటీన్ ఏంటో తెలుసుకుందాం.. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మలైకా తన ఫిట్‌నెస్ జర్నీని పంచుకుంది. ‘నాకు 40 దాటాకే నిజంగా యోగా, మైండ్‌ఫుల్ ఈటింగ్, కుకింగ్ మీద ఇంట్రెస్ట్ వచ్చింది’ అని చెప్పుకొచ్చింది. ఆ మాటల వెనుక ఒక బ్యూటిఫుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్టోరీ ఉంది. మలైకా చెప్పినట్టు, 30లలో ఆమెకు ఫిట్‌నెస్ అంటే కేవలం వర్కౌట్స్, డైటింగ్ మాత్రమే. కానీ 40 దాటాక శరీరం కంటే మనసు, భావోద్వేగాలు కూడా ఆరోగ్యంలో భాగమేనని ఆమె తెలుసుకుంది. అందుకే యోగా స్టార్ట్ చేసింది. రోజూ సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ఆసనాలు రొటీన్‌లో భాగం చేసుకుంది. ‘యోగా నాకు ఫ్లెక్సిబిలిటీ ఇచ్చింది, ఒత్తిడి తగ్గించింది, ఇన్నర్ పీస్ ఇచ్చింది’ అంటోంది మలైకా.



## ఆ సంఘటన కలచివేసింది

హీరోయిన్‌గా ఎదిగే క్రమంలో ఎన్నో అవమానాలను, అవహేళనలను ఎదుర్కొన్నారట నటి మృణాల్ ఠాకూర్. ఇవన్నీ తనను మానసికంగా బలవంతురాలిని చేశాయంటున్నారామె. ఇటీవలే మృణాల్ లగ్జరీ మెర్సిడెస్ బెంజ్ కారును కొన్నారు. ఈ సందర్భంగా ఆనందం వెలిబుచ్చుతూనే తన జీవితంలో ఎదురైన మరిచిపోలేని అవమానాన్ని కూడా గుర్తు చేసుకుందీ భామ. ‘నేను చాలా పేద కుటుంబంలో పుట్టాను. నన్ను పెంచేందుకు అమ్మ చాలా కష్టపడింది. ఇంట్లో డబ్బులు ఉండేవి కావు. అలాంటి రోజుల్లో బంధువులే మమ్మల్ని చిన్నచూపు చూసేవారు. మా అమ్మను కారు కూడా ఎక్కనిచ్చేవారు కాదు. కారెక్కే అర్హతే మా అమ్మకు లేదన్నట్టు అవమానించారు. ఓ సందర్భంలో మా అమ్మను ఒంటరిగా వదిలేసి కారులో వెళ్లిపోయారట. ఆ సంఘటన నన్ను కలచివేసింది. అప్పుడే డబ్బు సంపాదించాలి. ఖరీదైన కారులో అమ్మను తిప్పాలని డిసైడ్ అయ్యాను. ఆ కల నేటికి తీరింది. మా బంధువుల్లో ఎవరికీ లేని బెంజ్‌కారును కొన్నాను’ అని చెప్పుకొచ్చారు మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం ఈ భామ అల్లు అర్జున్‌అట్లీ చిత్రంలో నటిస్తున్నది.

## ప్రభాస్ ‘ది రాజా సాబ్’ హిందీ వెర్షన్ సాంగ్‌కి సూపర్బ్ రెస్పాన్స్.. ఇప్పుడు ట్రెండింగ్‌లో..!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ హారర్-కామెడీ ఎంటర్‌టైనర్ ‘ది రాజా సాబ్’పై దేశవ్యాప్తంగా భారీ హైప్ నెలకొంది.సంక్రాంతి 2026 బరిలో జనవరి 9వ తేదీన విడుదల కానున్న ఈ సినిమాపై ప్రేక్షకులు, ఫ్యాన్స్, ట్రేడ్ వర్గాలలో అంచనాలు భారీగా ఉన్నాయి. ‘రెబల్ సాబ్’ పాటతో దేశం మొత్తం షేక్ అయింది. సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాక విడుదలైన మొదటి సాంగ్ ‘రెబల్ సాబ్’ సోషల్ మీడియాలో సెన్‌సేషన్‌గా మారింది. ప్రత్యేకంగా హిందీ వెర్షన్ భారీ స్థాయిలో వైరల్ అవుతోంది.

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, స్పాటిఫై లాంటివి మొత్తం ఈ పాటతో నిండిపోయాయి. ప్రభాస్ ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, తమన్ ఇచ్చిన మాస్ బీట్‌లు, స్టెప్పులు ఇవన్నీ కలిసి ఈ సాంగ్‌ను దేశవ్యాప్తంగా సూపర్ హిట్ చేశాయి. ఈ పాటకు ఇప్పటికే డజన్ల కొద్దీ కవర్ వెర్షన్లు, డాన్స్ వీడియోలు వస్తుండటంతో సాంగ్ మరింత ట్రెండ్ అవుతుంది. ‘ది రాజా సాబ్’లో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ముగ్గురు హీరోయిన్లు ఉండటం వల్ల రొమాన్స్, ఎంటర్టైన్‌మెంట్ డోస్ కూడా ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు.

సినిమాకు సంబంధించిన బిజినెస్ వివరాలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి. తాజా సమాచారం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ ప్రాంతాల్లో మాత్రమే₹130 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఒక హారర్ ఫాంటసీ కామెడీ జానర్ సినిమా కోసం ఇంత భారీ రేంజ్ రావడం చాలా అరుదు.దీనితో ప్రభాస్ మార్కెట్ ఎలాంటి స్థాయిలో ఉందో మరోసారి నిరూపితమయ్యింది. దర్శకుడు మారుతి ప్రత్యేకమైన కామెడీ టైమింగ్‌తో ఎంతగానో అలరిస్తాడు అన్న విషయం తెలిసిందే. అతని స్టైల్, ప్రభాస్ స్టార్ పవర్ కలిసివస్తే సినిమా అల్టిమేట్ ఎంటర్‌టైనర్‌గా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భారీ ప్రొడక్షన్ విలువలు కూడా మరో పెద్ద హైలైట్. సంక్రాంతి 2026లో ఈ సినిమా సంచలనాలు సృష్టిస్తుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**